

శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేధింపులు ఆపాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - సామర్లకోట

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్ వి శివలక్ష్మిపై కమి షనర్ వేధింపులకు గురిచేయడాని నిరసిస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు, పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మృతుల బిడ్డల ఫిక్సిడ్ డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్‌కృతికా శుక్లా

క్వారీ ప్రమాద మృతుల బిడ్డలను ఆదుకోవాలి

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని ఎస్ పైడిపాల గ్రామ శివారు జరిగిన క్వారీ ప్రమాదంలో మతి చెందిన దంపతుల బిడ్డలను ఆదుకోవాలని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాను కలెక్టర్ కార్యాల యంలో మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బాధిత కుటుంబానికి వ్యవసాయ భూమితో పాటు, గహ నిర్మాణం. పిల్లల చదువుకు అవసరమైన సదుపాయాలు కల్పనకు పూర్తి బాధ్యత వహిస్తామని హామీ ఇచ్చినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు మృతి చెందిన దంపతులకు చెందిన ఇద్దరు పిల్లలకు భూగర్భ గనుల శాఖ అధికారులు ఒక్కొక్కరికి లక్ష పదివేల రూపాయలు చొప్పున ఏర్పాటు చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను కలెక్టర్ బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు

బదిలీల గందరగోళం

- షెడ్యూల్ ప్రకారం సాగని ప్రక్రియ
- టీచర్ల బదిలీల్లో రోజుకో నిర్ణయం
- అయోమయంలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉపాధ్యాయుల బదిలీలు ప్రక్రియ మొదటి నుంచి గందరగోళంగా మారింది. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ సైతం అస్తవ్యస్తంగా ఉందని టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. వేసవి సెలవుల్లో జరపాల్సిన బదిలీలు అకడమిక్ ఇయర్ మధ్యలో నిర్వహిస్తున్న తరుణంలో పలు విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. మరోవైపు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఇప్పుడు బదిలీలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా బదిలీ ప్రక్రియలో సర్కారు రోజుకో నిర్ణయం తీసుకుంటూ టీచర్లను మరింత గందరగోళంలోకి నెడుతున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 16 వేల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో 2,803 మంది తప్పనిసరిగా బదిలీలు అవ్వాల్సి ఉంది. కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 7,934 మంది ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకున్నారు.6,796 మంది రిక్వెస్ట్ బదిలీలకు అప్లికేషను పెట్టుకున్నారు. బదిలీలకు ఈ నెల 13న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 14 నుంచి 17 వరకూ ఆల్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వగా మరో రెండు రోజులు పెంచి 19 వరకు పెంచారు. 18 నుంచి 20 వరకూ పరిశీలన జరిపారు. ఈ నెల 26న ఫైనల్ సీనియారిటీ లిస్ట్ ప్రకటించి, వచ్చే జనవరి 2 నుంచి 10 వరకూ బదిలీ స్థానాల జాబితాను ప్రకటించనున్నారు. 12న బదిలీ ఉత్తర్వులను డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

షెడ్యూల్ ప్రకారం సాగని ప్రక్రియ

బదిలీలు, ప్రమోషన్ల సమయంలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవా లని మొదటి నుంచి యూటీఫ్ వంటి ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. అయితే షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో పలువురు టీచర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పాయింట్ల విషయంలో రోజుకో నిర్ణయం తీసుకోవడం వల్ల ఇబ్బం దులు తప్పడం లేదు. సవరణలు ఉత్తర్వుల రూపంలో ఇవ్వాల్సి ఉన్నా.. అధికారులకు ఆన్‌లైన్ సమావేశాల్లో మాత్రమే ఉన్నతాధికారులు సూచిస్తు న్నారు. దాంతో ఈ సమాచారం ఉపాధ్యాయులకు తెలియడంలేదు. ఉపా ధ్యాయ సంఘాల నేతలకు పాయింట్లు లేవని ముందు తెలిపారు. తర్వాత ప్రతి ఉపాధ్యాయ సంఘం నుంచి ఇద్దరికి పాయింట్లు ఇస్తామని చెప్పినా అందులోనూ స్పష్టత లేదు. జిల్లా సంఘాల్లో పని చేస్తున్న వారికి కొందరికి పాయింట్లు రాలేదని తెలుస్తోంది. రేషనలైజేషన్ పై బదిలీ అయిన టీచర్లకు పాయింట్లు ఇస్తామని ముందు చెప్పారు. ఆ తర్వాత సీనియర్లకు పాయింట్లు ఇవ్వలేదు. జూనియర్లకే ఉంటాయని తెలిపారు. తాజాగా ఉత్తర్వులు సవరణ ప్రకారం 2021లో బదిలీ అయిన వారికి కూడా పాత స్టేషన్ పాయింట్లు కల్పించాలని పేర్కొన్నారు. పాయింట్లు రాలేదని సీనియర్లు దరఖాస్తు చేసుకోలేదు. ఇప్పుడు పాయింట్లు ఇస్తామని చెప్పడంతో పలువురు అయోమ యంలో పడ్డారు. ఇలా అనాలోచిత, స్పష్టత లేని ఉత్తర్వులతో టీచర్లలో ఆందోళన మరింత పెరుగుతోంది.



మరింత సమయం కేటాయించాలి

బదిలీల ప్రక్రియ గందరగోళంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం షెడ్యూల్లో మార్పులు చేసి దరఖాస్తులు కోసం మరింత అదనపు సమయం పెంచాలి. ఉపాధ్యాయుల్లో ఉన్న అనుమానాలను తొలగించి బదిలీలు చేపట్టాలి. చెవిటి, మూగ తదితర అంగవైకల్యం ఉన్న టీచర్లకు పాయింట్స్ ఇవ్వాలి.

టి.చక్రవర్తి, యూటీఫ్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి

గుట్కా అమ్మకాలపై

కోర్టు స్టే అమలు చేయాలి

- టౌన్ పాన్ షాపు యజమానుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరంలో గుట్కా, పాన్ అమ్మకాలపై కేసులు పెట్టవద్దని కోర్టు ఇచ్చిన స్టేను అమలు చేయాలని ది టౌన్ పాన్ షాపు యజమానుల సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికంగా విలేకరులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరిగెల వెంకట కష్ణారావు, జిల్లా అధ్యక్షుడు మాధవరపు శ్రీనివాసరావు, సలహాదారుడు గోపిశెట్టి బూరయ్యలు మాట్లాడుతూ పాన్ షాపులు పెట్టుకొని సుమారు 75 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నా ర న్నారు. తక్షణమే కోర్టు స్టేను పోలీసు, ఆహార తనిఖీ అధికారులు అమలు చేయాలని వారు సూచించారు. అలాగే కాకినాడ నగరంలో తమ పాన్‌షాపుల నుండి చెత్తకు నెలకు రూ.300 వసూలు చేస్తున్నా రని, దాన్ని రూ.150 తగ్గించాలని కోరారు. ఎంతోమందికి ఉపాధి కలిగే ఈ పాన్ షాపుల నిర్వహణకు హైకోర్టు ఇచ్చిన స్టేను పాటించా లని కష్ణారావు, శ్రీనివాసరావు, బూరయ్యలు ఆయా శాఖల అధికారు లకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం సభ్యులు మేళం రమణ ఆకేటి వెంకటేశ్వరరావు, పరిమి బద్రి, సుబ్బారావు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి - కాజులూరు

ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతుందని కాకినాడ రెవిన్యూ డివిజనల్ అధికారి బీవీ రమణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో రెవెన్యూ అధికారులకు రైస్ మిల్లర్ మిల్లర్లకు సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు సంబం ధించి ఆర్‌డిఒ బివి రమణ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టినట్టు ఇందుకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్ ఈ క్రాప్ బుకింగ్ ఆధార్ సహిత సేవల ద్వారా కొనుగోలు చేస్తున్నందున రైతులు తాము పండించిన పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించు కోవాలని తెలిపి ఉన్నారు ఈ నేపథ్యంలో మిల్లర్లు సకాలంలో గోతాలు అందించడం, అన్లోడింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు. అదేవిధంగా కాజులూరు మండల పరిధిలో ఉన్న రైస్ మిల్స్‌తో పాటు, కరప, తాళ్ళరేవు మండల పరిధిలో రైస్‌మిల్స్‌తో కాజులూరు రైతు భరోసా కేంద్రాలను అను సంధానం చేస్తామన్నారు. రైతులు ఎవరు ఈ విషయంలో ఆందోళన చెందన క్కర్లేదని వ్యవసాయ రెవెన్యూ పౌరసరఫరాల శాఖ సిబ్బంది మండల స్థాయిలో అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో. తహశీల్దార్ సాయి సత్యనారాయణ. ఎంపిడిఒ ఇందిరాదేవి, పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ తాతపూడి శ్రీనివాస్. ఆర్ఐ వేగేశ్వరరావు, గ్రామ వ్యవసాయ అధికారులు. రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

డిఎంఎఫ్ పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాలో జిల్లా ఖనిజ ఫౌండేషన్ (డీఎంఎఫ్) కింద మంజూరైన పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానందహాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఖనిజ ఫౌండేషన్ (డీఎంఎఫ్) సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా కాకినాడ రూరల్ ఎంఎల్ఏ కురసాల కన్నబాబు, మైన్స్ అండ్ జియాలజీ డీడీ ఇ.నరసింహారెడ్డితో కలిసి డీఎంఎఫ్‌కు సమకూరిన మొత్తం, వివిధ పనులకు చేసిన ఖర్చు, జరుగు తున్న పనుల్లో పురోగతి, కొత్త పనుల ప్రతిపాదనలపై సమీక్షించారు. కాకినాడ జిల్లాలో తొమ్మిది మండలాల పరిధిలో మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నా యని ఈ కార్యకలాపాలతో ప్రత్యక్షంగా (10 కి.మీ. పరిధి), పరోక్షంగా (10-25 కి.మీ. పరిధి) ప్రభావితమవుతున్న గ్రామాలు, ఆవాసాల్లో డీఎంఎఫ్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. ఈ మేరకు కాకినాడ జిల్లాలో దాదాపు రూ. 11 కోట్లతో చేపట్టిన 51 పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసేందుకు గ్రామీణ నీటి సరఫరా, సర్వ శిక్షా అభియాన్, రహదారులు, భవనాలు శాఖ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాజాగా జరిగిన సమావేశంలో రూ.2 కోట్ల అంచనాలతో ఏలేశ్వరం-తుని, కత్తిపూడి రోడ్డు పనులతో పాటు ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం, తుని, తొండంగి మండలాల్లో ఇరిగేషన్ వ్యవస్థల ఆధునికీకరణ, హాస్టల్ బ్లాకుల నిర్మాణం తదితరాలకు సంబంధించి మొత్తం రూ.4.57 కోట్లతో పది పనులకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఈ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. అదే విధంగా గొర్రిపూడి, యండమూరు పరిధిలో రబీలో సాగుకు ఇబ్బంది లేకుండా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చిన్నపాటి లిఫ్ట్ పునరుద్ధరణ, ఆక్వాడెక్ట్ అత్యవసర పనుల వివరాలను ఎంఎల్ఏ కురసాల కన్నబాబు సమావేశం దృష్టికి తీసుకురాగా ఈ పనులకు సంబం ంచి ప్రతిపాదనలు రూపొం దించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హరిప్రసాద్‌బాబు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ ఎం.శ్రీనివాస రావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎం.శ్రీనివాస్ హాజరయ్యారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆస్తిపన్ను, కుళాయి పన్నులపై ప్రత్యేక దృష్టి సారించాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పన్నుల వసూళ్లపై సమీక్షించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్న నేపథ్యంలో పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మొండి బకాయిలతోపాటు కుళాయి పన్నుల వసూళ్ళపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రెడ్ నోటీసులను జారీ చేయడంతో పాటు ప్రతీ పన్ను చెల్లింపుదారుడిని కలిసి చెల్లింపులు చేసేలా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక కార్యాచరణతో చూడాలన్నారు. అనంతరం యూజర్ చార్జీలపై సమీక్షించారు. ప్రస్తుతం వారానికి ఒక్కసారి మాత్రమే చేపట్టే స్పెషల్ డ్రైవ్‌లో ఆయా సర్కిల్స్, డివిజన్లలో స్పెషల్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, కార్యద ర్శులు, వాలంటీర్ల చొరవ వల్ల యూజర్‌చార్జీల వసూళ్లలో అగ్రస్థానంలో నిలిచా మన్నారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పద్వీచరణ్ పాల్గొన్నారు.



వేళంగిలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా చిన్నారుల క్యాండిల్ సర్వీస్



వద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న సుకుమార్ మిత్ర బృందం

ఉత్సాహంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు



మెక్‌లారిన్ పాఠశాలలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఆర్‌డిఒ రమణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మెకలారిన్ హై స్కూల్ ఆవరణలో హెచ్‌ఎం కేర్లిన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఐక్య క్రిస్మస్ వేడుకలలో ప్రత్యేక అధికారి ఆర్‌డిఒ బివి రమణ పాఠశాలలో మేకలారిన్ బేట్స్ దంపతుల విగ్రహాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. హెచ్‌ఎం పాస్టర్ జాన్ మోజెస్ శేఖర్. సౌజన్య, విద్యార్థులు స్కూల్ సిబ్బంది మధ్య కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచిపెట్టారు. **కరప** మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన యలమంచిలి సుకుమార్ గత17 సంవత్సరాల నుండి సేవా కార్యక్రమాలో భాగంగా క్రిస్మస్ సంద ర్భంగా శుక్రవారం జనావళి వృద్ధుల ఆశ్రమంలో నడుకుదురు, తూరంగి గ్రామాల్లో ఉన్న అనాథాశ్రమంలో ప్రతి ఏడాదిలాగే క్రిస్మస్ వేడుకలు వృద్ధులతో కలిసి నిర్వహించారు. అనంతరం రూ.20 వేల విలువైన చీరలు, దుప్పట్లు, లుంగీలు సుకుమార్ తన స్నేహితులతో కలిసి వారికి అందజేశారు. కార్యక్రమంలో జయేంద్ర బాబు, పేరూరి ప్రసాద్, ప్రకాష్ ,సోనీ నక్క వీరబాబు సీతారాముడు, తణుకులు శ్రీను పాల్గొన్నారు. వేళంగిలో క్రైస్ట్ చాపల్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన వేడుకల్లో క్రిస్మస్ పాటలు, కొరియోగ్రఫీ, క్యాండిల్స్ సర్వీస్ కార్యక్రమాలు నిర్వ హించారు. కార్యక్రమంలో గ్రేస్ విక్టర్ పాలచర్ల. పాస్టర్ పి.సత్య ప్రసాద్, డాక్టర్ స్పర్జెన్ రాజు, కురుపూడి సూరిబాబు, కపావరం, మోషే, సాయి, ప్రసాద్, సాగర్, లాజరస్ పాల్గొన్నారు. **గండేపల్లి** మండలం నీలాద్రి రావుపేటలో క్రీస్తు సంఘం ఆధ్వ ర్యంలో క్రిస్మస్ వేడుకల్లో జాకబ్, గండేపల్లి కో ఆప్షన్ ఎంపిటీసీ సభ్యులు సుదర్శన్ సామ్యూల్, ఎస్ జీవరత్నం, ఎస్.ఇస్సాకు జై భీమ్ యూత్ సభ్యులు కేక్ కటింగ్ చేశారు. సండే స్కూల్ పిల్లల నృత్యాలు క్యాండిల్ సర్వీస్ అలరించాయి. కార్యక్రమంలో జై భీమ్ యూత్ గౌరవ అధ్యక్షులు సేవా తాతబాబు, జోడా రవీంద్రనాథ్, జై భీమ్ యూత్ అధ్యక్షులు శీలం రాజేష్, లండా శివాజీ పండు, ఎల్. జాన్‌రత్నం శీలం వీర్రాజు, జోడా చైతన్యకుమార్, కోరి పెల్లి అజయ్, సొడగిరి అప్పారావు, లండా సురేష్, నాగులపాటి అరుణ్ పాల్గొన్నారు. జై భీమ్‌యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ జీవరత్నం, గండేపల్లి మండల కో ఆప్షన్ ఎంపిటిసి సిహెచ్ సామ్యూల్ సుదర్శన్, జాకబ్‌లను ఘనంగా సన్మానించారు.

మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా చేద్దాం

- రేంజ్‌లో రూ.11.63 కోట్ల గంజాయి దగ్ధం
- ఏలూరు డిఐజి పాలరాజు

ప్రజాశక్తి - జగ్గంపేట

మాదకద్రవ్యాలు వినియోగం రవాణా అరికట్టే విధంగా ముందుకు సాగు దామని అందుకు సమాజంలోని ప్రజలు అన్ని రకాల డిపార్ట్మెంట్లు సహకరించాలని ఏలూరు డిఐజి పాలరాజు కోరారు. కాకినాడ జిల్లా జగ్గంపేట సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం జగపతినగరం వద్ద శుక్రవారం ఏలూరు రేంజ్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో గత రెండేళ్ల నుంచి నమోదైన కేసులలో పట్టుబడ్డ గంజాయిని రాష్ట్ర డిజి ఆదేశాల మేరకు తగలబెట్టారు. కార్యక్రమంలో రేంజ్ పరిధిలోని ఎస్‌పిలు ఆయా సర్కిల్ పరిధిలోని స్టేషన్ల డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఐజి మీడియా సమా వేశంలో మాట్లాడారు. రేంజ్ పరిధిలోని 457 కేసులలో లభ్యమైన 66,540 కేజీల గంజాయి తగలబెట్టినట్టు తెలిపారు. అయితే వీటి విలువ రూ.11 కోట్ల 63 లక్షల 52 వేలు ఉంటుందన్నారు. 2020-21లో గంజాయితో 379 వాహనాలను సీజ్ చేయగా, 35 వేల కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 2021-22లో 20వేల కేజీలు పట్టుకోగా 43 శాతం గంజాయి రవాణా తగ్గుముఖం పట్టిందన్నారు. గతంలో కంటే 17శాతం వాహనాల సీజ్ కూడా తగ్గుముఖం పట్టిందన్నారు. గంజాయి వ్యాపారం చేసే రాష్ట్రాలలో తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ రాష్ట్ర వాసులు ఎక్కువగా ఉన్నారన్నారు. ఇప్పటివరకు గంజాయి పట్టివేతలు దొరికిన వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఇప్పటినుంచి వారి ఆస్తులు కూడా జప్తు చేసే చట్టాలు అమలులో ఉన్నా యన్నారు. అంతే కాకుండా గంజాయి సాగు చేసే మండలాల్లో 23 మండలాలు మల్కాజ్గిరి జిల్లాలో ఉండగా మన రేంజి పరిధిలోని మూడు మండలాల్లో 7000 ఎకరాల్లో సాగుతున్నట్టు ఆయన తెలిపారు. సంబంధిత సాగును ధ్వంసం చేసి ట్రైబల్ రైతులకు గంజాయి పండించడం వల్ల వచ్చే ప్రమాదాలు వివరించి, అదే విస్తీర్ణంలో ఉద్యానవన పంటలు సాగు చేసుకోవడానికి ప్రభుత్వం వైపు నుంచి అని ఏర్పాట్లు చేస్తామన్నారు. దీనికి సంబంధించి గంజాయి సాగు మండలాల్లో ఎస్టీ పెద్దలు ఎన్జీవో సహకారాలు తీసుకుంటా మన్నారు. సాటిలైట్ చిత్రాల ద్వారా రేంజ్ పరుగులోని ఎక్కడైనా సాగు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడమే కాక విస్తీర్ణాన్ని స్వాధీనం చేసుకోవడానికి సన్నద్ధం చేస్తున్నట్టు డిఐజి తెలిపారు. వచ్చే 2023 కొత్త సంవత్సరంలో గంజాయి అలవాట్లు పడకుండా యువతను వారి తల్లిదండ్రులను. కాలేజీ యాజమాన్యాలకు అవ గాహన కల్పించి, గంజాయి తగ్గుముఖం చేయడానికి ప్రయత్నాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణా జిల్లాల ఎస్‌పిలు ఎం. రవీంద్రనాథ్ బాబు, రాహుల్ దేవ్ శర్మ, సుధీర్ కుమార్ రెడ్డి, జాషువా, రవి ప్రకాష్‌ల పాల్గొన్నారు.



జగపతి నగరంలో గంజాయిని దహనం చేస్తున్న పోలీసు అధికారులు




జిల్లా పేరేడ్ గ్రౌండ్‌లో వందనం స్వీకరిస్తున్న డిఐజి పాలరాజు

శాంతి భద్రతల పర్యవేక్షణలో ఏఆర్ సిబ్బంది వెన్నుముక

జిల్లా పేరేడ్ గ్రౌండ్లో సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరణ

కాకినాడ కార్పొరేషన్ : శాంతిభద్రతల పర్యవేక్షణలో, విధి నిర్వహణలోనూ, గార్డ్ డ్యూటీలోనూ, ఎస్కార్ట్, బందోబస్తులను, ఏఆర్ సిబ్బంది పోలీస్ శాఖకు వెన్నుముకగా నిలు స్తున్న వీరి సేవలు ప్రశంసనీయమని డీఐజీ పి. పాలరాజు కొనియాడారు. శుక్రవారం కాకినాడ జిల్లా పేరేడ్ గ్రౌండ్లో, పోలీస్ సాయుధ దళ కార్యక్రమానికి డీఐజీ పాలరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా అడ్మిన్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీహరిరావు, పరేడ్ కమాండర్‌గా ఏఆర్ సిబ్బంది కంటిన్‌జెంట్లుగా ఏర్పడి మర్యాద పూర్వకంగా చేసిన గౌరవ వందనాన్ని డీఐజీ స్వీకరించారు. అనంతరం కవాతును సమీక్షించి వారిని అభినందించారు. ప్రభుత్వ అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో పాటు నీతి నిజాయితీలతో చిత్తశుద్ధితో నిర్వర్తించా లన్నారు. అందరికీ మార్గదర్శకంగా నిలిచి పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచడానికి కృషి చేస్తూ ఎటువంటి క్లిష్టమైన బాధ్యతలు అప్పగించినా పోలీసు అధికారులు, సిబ్బంది ముందుండి ప్రజాసేవయే మన కర్తవ్యం అన్న విషయాన్ని ఎల్లవేళలా గుర్తుంచుకొని సేవా భావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రవీంద్ర నాథ్ బాబు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ(రిజర్వ్), బి సత్యనారాయణ, ఎస్బి డిఎస్‌పి ఎం.అంబికా ప్రసాద్, కాకినాడ ట్రాఫిక్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, కాకినాడ శాంతి భద్రత డిఎస్పి పి.మురళీకష్ణారెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డి.ఎస్.పి బి.అప్పారావు, రిజర్వ్ పోలీసు అధికారులు, కాకినాడ పట్టణ రూరల్ సిఐలు, ఎస్ఐలు,హెూమ్ గార్డ్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తే తిరుగుబాటే..



తాళ్లరేవులో కౌలు రైతులను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో రైతు వేషధారణలో విద్యార్థులు



కోటనందూరులో రైతులతో యనమల కృష్ణుడు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధానాలు మార్చుకోవాలని లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని, వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే విధానాలు మార్చుకోకపోతే రైతుల నుంచి తిరుగుబాటు తప్పదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం హెచ్చరించింది. అంతర్జాతీయ రైతు దినోత్సవ సందర్భంగా తాళ్ళరేవు మండలం జార్జిపేట కోనేరు వద్ద పాలెపు ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వళ్ల రాజుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా 100 శాతం పెంచడం వల్ల రైతాంగం అప్పులు ఊబిలో కూరుకు పోతున్నా రన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా గిట్టుబాటు ధరలు లేవని, మార్కెట్ సౌకర్యం కల్పించలేని దీనస్థితిలో కేంద్రం ఉన్నదన్నారు. దేశంలో వ్యవసాయం అంతా కౌలు వ్యవసాయంగా మారుతుందని, అప్పుల పాలవుతున్న కౌలు రైతులను కేంద్రం గుర్తించ డం లేదన్నారు. ఆత్మ హత్యలు పెరుగుతున్నాయన్నారు. బడ్జెట్లో రోజు రోజుకి వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గిస్తున్నారన్నారు. అనంతరం కౌలు రైతులు గుత్తుల చిన్నయ్య, పలివెల సింహాచలం లను దుశ్శాలువ పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అత్తిలి బాబురావు మాట్లాడారు. మండల అధ్యక్ష కార్యదర్శులు పాలెపు ఈశ్వర రావు, సల్లా సంతోష్ కుమార్, పిల్లి నాని, పంపన నాగేశ్వరరావు, దంగేటి విజ్ఞేశ్వరరావు, వాసంశెట్టి సత్తిబాబు మరియు కౌలు రైతులు పాల్గొన్నారు. **కాకినాడ/ ప్రత్తిపాడు** మండలం ధర్మవరం గ్రామంలో మంగియమ్మ పేట ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రైతు దినోత్స కార్యక్రమంలో విద్యార్థులు రైతుల వేషధారణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు మాట్లా డుతూ రైతుల పడుతున్న కష్టాన్ని ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరు గుర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రామ పెద్దలు, రైతులు వ్యవసాయానికి సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కే గంగాభవాని, హెచ్‌ఎం కేఎస్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు జువ్వల బాబులు, జువ్వల చినబాబు, అనసూరి చిట్టిబాబు పాల్గొన్నారు. **కోటనందూరు** మండలం కోటనందూరు, తాటిపాక గ్రామాల్లో వరి పొలాల్లో పని చేస్తున్న రైతులను తుని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ యనమల కృష్ణుడు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, రైతులకు నష్టపరిహారం తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గాడి రాజబాబు, లెక్కల భాస్కర్, బోడపాటి సత్య నారాయణ, సామినేడి కృష్ణార్జున, అంకమరెడ్డి రమేష్, షేక్ నవాజ్ జానీ, ఉన్నీసా, సుర్ల లోవరాజు పాల్గొన్నారు.



మంత్రి వేణు పుట్టినరోజు వేడుకలలో వైసిపి నాయకులు

ఘనంగా మంత్రి వేణు పుట్టినరోజు

ప్రజాశక్తి - కాజులూరు

రాష్ట్ర బీసీ సంక్షేమ సమాచార శాఖ సినీ మాటోగ్రఫీ మాత్యులు వేణుగోపాల కృష్ణ పుట్టినరోజు వేడుకలు మండల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పుట్టినరోజు కార్యాలయంలో ఎంపీపీ మాత భారతి మురళి, జడ్‌పిటిసి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో గొల్లపాలెంలో మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసు రాజు ఆధ్వర్యంలో పంచాయితీ కార్యాలయాల్లో సర్పం చులు ఎంపిటీసీలు ఆధ్వర్యంలో కేకు కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గ యువనేత చెల్లుబోయిన నరేన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఎంపిటీసీ సభ్యులు సహకార సంఘ అధ్యక్షులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - యానాం

పట్టణంలోని మెట్టకూరులో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక సాయికాలనీలో నివాసం ఉంటున్న వివాహిత దంగేటి లక్ష్మీభవాని(20) బుధవారం ఉదయం ఫాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. యానాం మెట్టుకూరు కాలనీకి చెందిన లక్ష్మీభవాని, దంగేటి వరప్రసాద్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. వారికి రెండేళ్ల కుమార్తె ఉంది. వరప్రసాద్ ఆర్‌ఎంపిగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల కాలంలో భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వరప్రసాద్ మంగళవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్పటి నుంచి వరప్రసాద్ స్థానిక జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృదేహాన్ని యానాం జిజిహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బడుగు కనకారావు తెలిపారు.

గాయపడిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -మామిడికుదురు

రోడ్ ప్రమాదంలో గాయపడి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కె.నరసింహమూర్తి(71) పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడని ఎస్ఐ జానీబాషా తెలిపారు. ఈ నెల 21న పాశర్లపూడి కైకాలపేట జాతీయరహదారిపై నడిచి వెళ్తున్న నరసింహమూర్తిని బుధవారం రాత్రి బైకుపై వెళ్తున్న గోగనమఠానికి చెందిన ఏడిద సత్యనారాయణ ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడటంతో నరసింహమూర్తిని ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని కుమారుడు ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రూ.40వేల విలువైన గడ్డిమేటు దగ్ధం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మ పేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడు ఎకరాలు గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన పద్మ యోహాన్ కు చెందిన మూడు ఎకరాల గడ్డివాము, టేకుమూడి చిన్నయ్యకు చెందిన రెండున్నర ఎకరాల గడ్డివాము, మేడిశెట్టి శ్రీనివాస్‌కి చెందిన రెండు ఎకరాల గడ్డివాము అగ్నికి ఆహుతయ్యాయి. వీటి విలువ రూ.40వేలు ఉంటుందని ఫైర్ అధఙకారులు తెలిపారు.

ఘర్షణ కేసులో మూడేళ్ల జైలు

ప్రజాశక్తి - కొత్తపేట

భూ తగాదాలు, ఘర్షణ కేసులో నిందితునికి మూడేళ్ల జైలు, రూ.4,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ఎస్ఐ వి.మణికుమార్ తెలిపారు. ఏనుగుమహల్ గ్రామంలో భూ తగాదాలు విషయంలో రెండు గ్రూపులు ఘర్షణ పడ్డాయి. అప్పటి ఎస్ఐ బి.జగన్‌మోహన్‌రావు ఇరువురిపై కేసులు నమోదు చేశారు. కొత్తపేట ఎస్ఐ డి.విజయకుమార్ నిందితులపై ఛార్జిషీట్ ఫైల్ చేవారు. నేరం రుజువు కావడంతో సలాది కళ్యాణ్‌కుమార్, సలాది సత్యనారాయణలకు అసిస్టెంట్ సెషన్ జడ్జి శ్రీధర్ మూడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.4,500 జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. జరిమానా చెల్లించకుంటే మరో రెండు నెలలు శిక్ష ఉంటుందన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలీ శివారు నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ సిహెచ్ సుధాకర్ తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,220 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు

పాము కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం మీనా నగరంకి చెందిన మిడపంపుల వీర్రాజు(60) పాము కాటుకి గురై మరణించినట్లు పోలీసులు తెలిపారు మతుడు వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం పొలం పని ముగించుకొని ఇంటికుళాయి వద్ద కాళ్లు కడుక్కుంటుండా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే స్థానికులు కొవ్వూరు ప్రభుత్వ అసుపత్రకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మతి చెందాడు. కుమారుడు పోశియ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సిఐ లక్ష్మణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో 16వ నెంబరు జాతీయ రహదారి ప్రక్కన 1.50 కేనజీల గంజాయిని విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. షేక్ సాహిజాన్, అనసూరి మహేష్, వానపల్లి కుమార్, మండిగ ప్రభువిజయరామ్, మడగల రాజేష్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు.



చోరీకి గురైన ధాన్యం బస్తాల రికవరీ

ప్రజాశక్తి-నిడదవోలు

చోరీకి గురైన 80 ధాన్యం బస్తాలను రికవరీ చేశామని నిడదవోలు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. మండలంలోని సింగవరం, తాళ్లపాలెం, కంసాలపాలెం గ్రామాల్లో ఇటీవల ధాన్యం బస్తాలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేవారు. దొంగలించబడిన 80 ధాన్యం బస్తాలు రికవరీ చేసి శుక్రవారం సింగవరం సొసైటీ అధ్యక్షులు పెన్మత్స చందు ఆధ్వర్యంలో అందజేశారు. రైతులు కర్రి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నృత్య ఉత్సవాలకు ప్రసాద్‌కు ఆహ్వానం

సామర్లకోట : తిరుపతిలో ఈ నెల 24, 25 తేదీల్లో ఆర్‌కె కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అదివో అల్లదివో' నత్య ఉత్సవాలకు సామర్లకోటకు చెందిన ప్రముఖ కూచిపూడి నత్యకారుడు అలమండ ప్రసాద్‌కు ఆహ్వానం అందింది. ఈ వివరాలను ఆయన శుక్రవారం విలేకర్లకు వివరించారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో రెండు రోజులపాటు ఆర్‌కె కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు హాజరు కావాలని ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రంజిత్‌కుమార్ లేఖ పంపారన్నారు. సందర్భంగా తనకు శ్రీ గురు బ్రహ్మ అవార్డు-2022 అందించనున్నారన్నారు.

దళితుల పథకాలను అమలు చేయాలి

యు. కొత్తపల్లి : గతంలో దళితులకు అందించిన సంక్షేమ పథకాలను యథావిధిగా అమలు చేయాలని పిఠాపురం ఎంఎల్‌ఎ పెండం దొరబాబుకు వాకతిప్ప దళిత యువకులు వినతి పత్రాన్ని అందించారు. గడపగడపక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన వాకతిప్ప దళితపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా దళితపేట యువకులు మట్లాడారు. దళితులకు 27 సంక్షేమ పథకాలును వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దీంతో దళిత యువకులకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దళిత సంక్షేమ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

కాకినాడ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగులకు సంబంధించి ఆరుగురికి కారుణ్య నియామక పత్రాలను శుక్రవారం అందించారు. కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబుతో కలిసి అందించారు. ఐదుగురికి జూనియర్ సహాయకులుగా, ఒకరికి ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం పోస్టింగ్ ఇస్తామన్నారు.

యశోద ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

హైదరాబాద్‌లోని ప్రముఖ హాస్పిటల్స్ గ్రూప్ అయిన యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరంలోని 'యశోద మెడికల్ సెంటర్'లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 500 మందికి వైద్యసేవలు అందించారు. రాజమహేంద్రవరం బైపాస్ రోడ్‌లోని జాంపేట ప్రాంతంలో రెండేళ్లుగా వైద్య కన్సల్టేషన్స్, ఓపి (అవుట్ పేషెంట్) సేవలను ఈ సెంటర్ అందిస్తుంది. రాజమండ్రి యశోద హాస్పిటల్స్ మెడికల్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ వైద్య శిబిరంలో యశోద హాస్పిటల్స్ కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, జనరల్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ల నుంచి స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొన్నారు. ఉచిత హెల్త్ స్క్రీనింగ్‌తో పాటు ఇసిజి, డిఎకో, గ్లూకోజ్, సిబిపి, క్రియేటినిన్, థైరాయిడ్ వంటి వైద్య పరీక్షలను ఉచితంగా చేశారు.అవసరమైన



రోగులను పరీక్షిస్తున్న వద్యులు



వైద్యపరీక్షలను నిర్వహిస్తున్న సిబ్బంది

సర్పంచుల సమాఖ్య నియోజకవర్గం అధ్యక్షునిగా వెంకటరెడ్డి

ప్రజాశక్తి-మండపేట

సర్పంచుల సమాఖ్య నియోజకవర్గం అధ్యక్షులుగా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక సర్పంచ్ వీధి వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండపేట నియోజకవర్గం కార్యవర్గ సర్పంచుల సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఉపాధ్యక్షులుగా మారేడుబాక, లొల్ల, సోమేశ్వరం సర్పంచులు మట్టపర్తి గోవిందరాజు, వాస కోటేశ్వరరావు, చాత్రాతి జానకిరాంబాబు, కార్యదర్శిగా సోమేశ్వరం సర్పంచ్ అరీఫ్, సంయుక్త కార్యదర్శులుగా అర్తమూరు, చెల్లూరు సర్పంచులు గొలుగూరి అన్నపూర్ణ, పాలిక రాఘవ, కోశాధికారిగా వెలగతోడు సర్పంచ్ నలమామిడి కృపరాజు ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచుల గౌరవ వేతనం రూ.3వేల నుంచి రూ.15వేల వరకు పెంచాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు రాష్ట్ర ప్రభుత్వమే భరించడం, సచివాలయంపై వచ్చే ఆదాయాన్ని పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలని తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం గౌరవాధ్యక్షులు ఆశీర్వాదం మాట్లాడుతూ జనవరి 5న తాడేపల్లిలోని సిఎస్ఆర్ కళ్యాణమండపంలో రాష్ట్ర సర్పంచుల సంక్షేమ కార్యవర్గం ఎన్నికలు జరుగుతాయన్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచులు పంచాయతీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.



నియోజకవర్గ నూతన కార్యవర్గ ఇదే...

పరీక్షకు 1,439 మంది హాజరు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వెంకటజ్యోతిర్మయి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

న్యాయశాఖలో ఉద్యోగాల భర్తీ కోసం శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 1,766 మందికి 1,439 మంది హాజరయ్యారని, 327 మంది గైర్హాజరయ్యారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వెంకటజ్యోతిర్మయి తెలిపారు. వికలాంగుల కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న 41 మందికి 35 మంది హాజరయ్యారన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టిక్కెట్లను పొందడంలో ఇబ్బందులు ఎదురైతే హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబరు 0863-2372752 లేదా helpdesk-hc.ap@alij.gov.in సంప్రదించాలన్నారు. హాల్ టిక్కెట్లు పొందిన అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి 90 నిమిషములు ముందుగా చేరుకోవాలన్నారు. పరీక్షా సమయమునకు 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం తలుపులు మూసేస్తారన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు, తప్పని సరిగా ఏదైనా ఒక గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కన్షిక

ప్రజాశక్తి - అన్నవరం(శంఖవరం)



శంఖవరానికి చెందిన నాలుగేళ్ల కన్షిక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించింది. గ్రామానికి చెందిన వెలగ లక్ష్మణరావు, అనంత రామలక్ష్మి దంపతుల కుమార్తె కన్షిక వయస్సు ఇప్పుడు 3 సంవత్సరాల 9నెలలు. తండ్రి లక్ష్మణరావు ఉపాధ్యాయుడు కాగా, తల్లి రామలక్ష్మి గహిణి. ఇంటి వద్ద మాట్లాడే మాటలను పలుకుతూ ఉండడంతో కన్షిక ఆసక్తిని తల్లి గమనించింది. దీంతో కుమార్తెకు శ్లోకాలు నేర్పించింది. 15 శ్లోకాలు, 9 తెలుగు పద్యాలు, 10 ఇంగ్లీషు పద్యాలు, 2 భజన గీతాలు, 30 జాతీయ ప్రశ్నలు, జవాబులు, 10 మంచి అలవాట్లు (తెలుగు, ఇంగ్లీషు భాషల్లో), 20 మానవ శరీర భాగాలు, వాతావరణం పేర్లు, నెలలు, 10 జంతువుల పిల్లల పేర్లు (తెలుగు, ఇంగ్లీషు, హిందీ) మూడుభాషలలో చెబుతుంది. ఇంకా 35 రకాల పండ్లను, 30 రకాల కూరగాయలను, 15 వాహనాలను, 22 జంతువులను గుర్తిస్తుంది. వీటితోపాటు మంచి నటన ప్రతిభతో కూడిన పదాలను పలుకుతూ నటించడం అలవాటు చేసుకుంది. ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు చిన్న పిల్లలకు ఆన్లైన్ ద్వారా 40 వ్యతిరేక పదాలపై పోటీ నిర్వహించగా, అందులో అతి చిన్న వయస్సురాలైన కన్షిక 40 వ్యతిరేక పదాలను కేవలం 25 సెకన్లలో సమాధానమిచ్చి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. కన్షిక ప్రతిభకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ప్రశంసా పత్రంతోపాటు మెడల్‌ను అందించారు. ఈ సందర్భంగా చిన్నారిని పలువురు అభినందించారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకరాజు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నూకరాజు డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఓటి, తదితర అలవెన్స్‌ల చెల్లించాలన్నారు. ఇఎస్ఐలో ఆర్‌టిసి ఉద్యోగులకు వైద్య సేవలను పునరుద్ధరించాలన్నారు. అకాల మరణాల నుంచి కార్మికుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు బికె.రామారావు మాట్లాడుతూ ఆర్‌టిసి అద్దె బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ నియామకాలు బదులుగా రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని కోరారు. అనంతరం ఆర్‌టిసి ఆర్‌ఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి బి.శిరీష, జిల్లా పబ్లిసిటీ కార్యదర్శి పి.సుధాకర్, సిఐటియు జిల్లా కమిటీ నాయకులు జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

దుమ్ములపేటలో గడప గడపకూ...

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ పదో డివిజన్ దుమ్ములపేటలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు, పలువురు అధికారులు, నాయకులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ పింఛన్లు తొలగిస్తున్నారంటూ జరుగుతోన్న ప్రచారాన్ని నమ్మరాదన్నారు. సాంకేతిక పరమైన అంశాలపై అధికారులు సర్వే చేస్తున్నారన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుందన్నారు. జనవరి నుంచి పింఛన్‌ను రూ.2750కు పెంచడంతోపాటు కొత్తగా 1,600 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, మాజీ కౌన్సిలర్లు నల్లబెల్లి సుజాత, మోసాపేతూరు, కామాడి దశరథ, వెలమల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్, సైబర్ నేరాలపై అవగాహన అవసరం

డిఐజి పాలరాజు వెల్లడి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి పోలీసు అధికారి అవగాహన కలిగి ఉండాలని ఏలూరు రేంజ్ డిఐజి జి.పాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశాన్ని ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు 30 శాతం తగ్గాయన్నారు. మరింత నియంత్రణకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగాలన్నారు. మహిళలు, బాలికలపైన నేరాలను, సామాజిక దురాచారంగా భావించి దర్యాప్తు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పిలు పి.శ్రీనివాస్, సత్యనారాయణ, జిల్లా ఎబి డిఎస్‌పి ఎం.అంబికా ప్రసాద్, కాకినాడ డిఎస్‌పి మురళీకష్ణారెడ్డి, పెద్దాపురం ఇన్‌ఛార్జి డిఎస్‌పి మురళీమోహన్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు



సమీక్ష సమావేశం మాట్లాడుతున్న ఏలూరు రేంజి డిఐజి పాలరాజు

ఒపిఎస్ కోసం ఉపాధ్యాయుల 3కె వాక్

ప్రజాశక్తి - పెద్దాపురం

యుటిఎఫ్ రాష్ట్ర పిలుపు మేరకు ఉపాధ్యాయులు ఒపిఎస్ కావాలంటూ పెద్దాపురం పట్టణంలో 3కె వాక్‌ను శుక్రవారం నిర్వహించారు. యుటిఎఫ్ పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట గుర్రాల సెంటర్ నుంచి దర్గా సెంటర్, మున్సిపల్ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ర్యాలీలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ వర్మ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా తాను అధికారంలోకొచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని ప్రకటించారన్నారు. అధికారంలోకొచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ సిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. 30 ఏళ్ల పాటు సర్వీసు చేసిన ప్రభుత్వ ఉద్యోగికి సరైన పెన్షన్ రాకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సూర్యనారాయణ, శివశంకర్, మధుకుమార్, సత్యవేణి, ఎల్ఐసి ఉద్యోగుల సంఘ నాయకులు, ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. దారి పొడవునా ప్రజానాట్యమండలి కళాకారులు డప్పుల దరువులు, నినాదాలు, పాటలతో హోరెత్తించారు.



యుటిఎఫ్ ఆధ్వర్యంలో 3కె వాక్‌ను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

లక్కవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా రుద్రరాజు

ప్రజాశక్తి-రాజోలు

మలికిపురం మండలం లక్కవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా రుద్రరాజు గోపాలకృష్ణరాజు నియమితులయ్యారు. ఆయన గతంలో ఛాంబర్ అధ్యక్షునిగా పనిచేసి స్వచ్ఛందంగా ఆ పదవి నుంచి తప్పుకొన్నారు. వ్యాపారుల అభ్యర్థనతో మళ్లీ ఆయనను తిరిగి అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. స్థానిక వ్యాపారులు, ఛాంబర్ ప్రతినిధులు శుక్రవారం గోపాలకృష్ణరాజును అభినందించారు. గతంలో ఆయన సారథ్యంలో ఛాంబర్ ఆర్థికంగా అభివృద్ధి చెందిందని, ఇప్పుడు కూడా అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, నారాయణరావు, పద్మనాభం, రవి, సూర్యప్రకాశరావు, బాబులు, శ్రీరామ్మూర్తి, రామలింగరాజు, రాము, భాస్కరరావు, కృష్ణ, సత్తిబాబు, రాంబాబు, శివశంకర్, సతీష్, వ్యాపారులు పాల్గొన్నారు.

రూ.1.89 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి -కాట్రేనికోన

మండల పరిధిలోని చెయ్యేరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లో-వోల్టేజి సమస్య పరిష్కరించేందుకు రూ.1.89 కోట్లతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని ఎఇ బి.నాగేశ్వరరావు తెలిపారు. 33/11 కెవి సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 5 ఎంవిఎ నుంచి 8 ఎంవిఎకు మార్చామన్నారు. దీని వల్ల విద్యుత్ సమస్యలకు పరిష్కారం దొరుకుతు,ంని తెలిపారు. రాజ మహేంద్రవరం నుంచి వచ్చిన ట్రాన్స్ ఫార్మర్ విభాగం, కాకినాడ నుండి వచ్చిన ప్రొటెక్షన్ విభాగం, అమలాపురం నుంచి వచ్చిన 50 మంది సిబ్బంది సహకారంతో దీన్ని పూర్తిచేవామన్నారు. దీని వల్ల చెయ్యేరు, అగ్రహారం గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. అమలాపు ఎలక్ట్రికల్ ఇఇ ఎం.రవికుమార్, ముమ్మిడివరం డిఇఇ ఎ.వీరభద్ర రావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి నడింపల్లి సూరిబాబు పనులను పర్యవేక్షించారు

కవిశ్రీ నీలంకు ఘన నివాళి

ప్రజాశక్తి -ముమ్మిడివరం

దళిత కవి కవిశ్రీ నీలంకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఆయన 8వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ముమ్మిడివరం పోలమ్మ చెరువు గట్టు వద్ద చిత్రపటానికి రిపబ్లిక్ పార్టీ నాయకులు, దళిత సంఘాలు, కవిశ్రీ అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్షరాలను ఆయుధాలుగా చేసుకున్న వ్యక్తి కవిశ్రీ నీలం అని సీనియర్ న్యాయవతి ధోనిపాటి ఆంజనేయులు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌పిఐ జిల్లా కార్యదర్శి చీకురుమిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, మట్ట సిద్ధార్థ గౌతమ్, ఎంవి.సూర్జం, కెఎస్ఎన్.మూర్తి, డి.ఏడుకొండలు, పి.నరసింహమూర్తి, పి.కష్ణంరాజు పాల్గొన్నారు

36 మందికి గృహ రుణాలు

ప్రజాశక్తి - యానాం

యానాం ఆది ద్రావిడ వెల్ఫేర్ అండ్ షెడ్యూల్ ట్రైబ్స్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా 36 మందికి గృహ నిర్మాణ రుణాలు మంజూరు చేశారని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఆయా లబ్ధిదారులకు రూ.5 లక్షలు అందిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.3.50 లక్షలు, కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.1.50లక్షలు అందిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం వాటా నిధులు ఇంకా మంజూరు కాలేదని తెలిపారు. కేంద్రం వాటా నిధులు విడుదల చేసిన వెంటనే 36 మంది లబ్దిదారులకు గహ నిర్మాణానికి మొదటి విడత మొత్తాన్ని అందిస్తారన్నారు. ఈ మేరకు ఆది ద్రావిడ వెల్ఫేర్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు.

ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ విధానాల అమలు

ఆలమూరు : సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఎంపిడిఒ జాన్ లింకన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరి షత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. పథకాల అమలులో ప్రజలకు నిత్యం సేవలు అందిస్తూ పనిచేయాలన్నారు.